



ఎమ్మిగనూరులో వినాయకుడి నిమజ్జనం

గంగ ఒడికి గణేశుడు

- కర్నూలు, ఆదోని మినహా అన్ని ప్రాంతాల్లో నిమజ్జనం
- శోభా యాత్రలో యువత ఉత్సాహం
- కోలాహలంగా సాగిన వేడుకలు

వినాయక చవితి సందర్భంగా విశేష పూజలందుకున్న గణేశుడు సోమవారం గంగ ఒడికి చేరాడు. కర్నూలు, ఆదోని పట్టణాలు మినహా జిల్లా వ్యాప్తంగా మూడో రోజు వినాయక నిమజ్జన వేడుకలు కోలాహలంగా జరిగాయి. జై గణేశా.. జైజై గణేశా నినాదాలు, మేళతాళాలతో గణనాథుడి నిమజ్జన కార్యక్రమం సంబరంగా సాగింది. ఆలూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ, మంత్రాలయం పట్టణాలతో పాటు ఓర్వకల్లు, కోడుమూరు, కల్లూరు తదితర మండలాల్లో మూడో రోజు వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి మండపాల నుంచి వినాయకుడిని కదిలించారు. నిమజ్జన కార్యక్రమానికి ఆటంకం లేకుండా తగిన జాగ్రత్తలతో యువత నృత్యాలు చేస్తూ కోలాటాలు వేస్తూ వినాయకుడిని గంగ ఒడికి సాగనంపారు. ఎమ్మిగనూరు పట్టణంలో భారీ వినాయక విగ్రహాలు వెళ్తుండగా శోభా యాత్ర యువతీ యువకుల ఉత్సాహం, కేరింతలతో సందడి నెలకొంది. ఆయా ప్రాంతాల్లోనీ నదులు, వంకలు, చెరువుల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

- ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ, మంత్రాలయం



కోడుమూరులో నిమజ్జనం చేస్తున్న అధికారులు



ఎమ్మిగనూరులో ..



పత్తికొండలో వినాయకుడి ఊరేగింపు



ఎమ్మిగనూరులో గంగ ఒడి చేరుతున్న వినాయకుని విగ్రహం




గోనెగండ్లలో ..



కౌతాళంలో యువకుల కేరింతలు



దేవనకొండ: నిమజ్జన వేడుకల్లో కేరళ సాంస్కృతిక కార్యక్రమాలు



గేట్లన్నీ మార్చాల్సిందే..!

తుంగభద్ర ప్రాజెక్టుపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నియమించిన నిపుణుల కమిటీ కీలక అంశాలను తెరపైకి తెచ్చింది. తుంగభద్ర డ్యాంకు సంబంధించి మొత్తం 33 గేట్లు మార్చాల్సిందేనని ఆ కమిటీ సూచించినట్లు సమాచారం. 70 సంవత్సరాలుగా అవే గేట్లను వినియోగిస్తున్నారు. నిజానికి డ్యాం గేట్ల జీవిత కాలం 45 సంవత్సరాలు. అయినప్పటికీ తుంగభద్ర డ్యాం గేట్లు మరో 25 సంవత్సరాలకు పైగా పొడిగించి వినియోగిస్తున్నారు. మళ్లీ వాటికి మరమ్మతులు చేస్తే డ్యాం భద్రతకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని సేఫ్టీ కమిటీ హెచ్చరించింది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ మూడు రాష్ట్రాల జీవనాడిగా ఉన్న తుంగభద్ర జలాశయానికి ఉన్న 33 పాత గేట్లను పూర్తిగా తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేయాల్సిందేనని కమిటీ సూచించింది.

- తుంగభద్ర డ్యాంను పరిశీలించిన నిపుణుల కమిటీ
- ఏడు దశాబ్దాలుగా అవే గేట్లు
- వాటి జీవితం కాలం 45 ఏళ్లు
- ఇప్పటికే 25 ఏళ్లు అదనంగా వినియోగం
- మరమ్మతులు చేస్తే జలాశయానికే ప్రమాదకరం
- డ్యాం గేట్లు, గ్యాలరీ తనిఖీ
- ప్రాజెక్టు నిర్వహణ ఇంజనీర్లతో భేటీ

కర్నూలు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం భద్రతపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నియమించిన నిపుణుల కమిటీ సోమవారం పరిశీలించింది. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) మాజీ ఛైర్మన్ ఏకే బజాజ్, హైడ్రో మెకానికల్, ఎలక్ట్రికల్ ఎక్స్‌పర్ట్ హర్కేష్ కుమార్, ఆదోనికి చెందిన తారాపురం సుధాకర్, ఆయా రాష్ట్రాల ప్రతినిధుల బృందం సభ్యులు డ్యాంను పరిశీలించారు. గత ఆగస్టు 10వ తేదీన చైన్ లింక్ తెగిపోయి కొట్టుకుపోయిన 19వ గేటు సహా డ్యాం 33 గేట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఢిల్లీకి చెందిన ఎక్స్‌పర్ట్ కమిటీ సభ్యులు ఏకే బజాజ్, హర్కేష్ కుమార్, తారాపురం సుధాకర్‌లు ఢిల్లీ నుంచి బెంగళూరు చేరుకున్నారు. అక్కడి నుంచి హోస్పేట్ దగ్గర ఉన్న టీబీ డ్యాంకు ఉదయం చేరుకున్నారు. తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు (టీబీపీ) సెక్రటరీ ఓ.రామకృష్ణారెడ్డి, ఎస్ఈ శ్రీకాంత్ రెడ్డి, డ్యాం పర్యవేక్షణ ఇంజనీర్లు వారికి స్వాగతం పలికారు. వీరితో పాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సెంట్రల్ డిజైనింగ్ ఆర్గనైజేషన్ (సీడీవో) ప్రతినిధులు కూడా ఉన్నారు. ముందుగా డ్యాం వివరాలను బోర్డు అధికారుల ద్వారా తెలుసుకున్నారు. గత నెలలో వరద ఉధృతికి కొట్టుకుపోయిన 19వ నెంబరు గేటును పరిశీలించారు. 1 నుంచి 33 గేట్ల వరకు ప్రతి గేటును ఆపరేషన్ తీరు, చైన్స్, గేట్లను సమగ్రంగా పరిశీలించారు. అంతేగాకుండా ప్రాజెక్టు గర్భంలో ఉన్నటువంటి గ్యాలరీని నిపుణుల కమిటీ పరిశీలించింది.

డ్యాం నిర్వహణ ఇంజనీర్లతో భేటీ

తుంగభద్ర డ్యాంను 1 నుంచి 16వ నెంబరు గేటు వరకు తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు నిర్వహణలో ఉంది. 17వ గేటు నుంచి కర్ణాటక జలవనరుల శాఖ ఇంజనీర్లు పర్యవేక్షిస్తున్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలం ప్రారంభానికి ముందు వరదలు మొదలయ్యాక డ్యాం గేట్ల పనితీరును ఇంజనీర్లు ఎప్పటికప్పుడు పరిశీలించాలి. డ్యాం నిర్వహణ ఎలా జరుగుతుంది? ఈ ఏడాది నీటి సంవత్సరం ప్రారంభంలో వర్షాలు రాకముందు డ్యాంకు వరద మొదలయ్యాక గేట్లను తనిఖీ చేశారా? మరమ్మతులు నిర్వహించారా? ఆ సమయంలో ఎలాంటి లోపాలను ఏవైనా గుర్తించారా? గుర్తించి ఉంటే ఎలాంటి లోపాలు గమనించారు. తదితర అంశాలపై నిర్వహణ నిపుణుల కమిటీ ఇంజనీర్లతో సమావేశమై వివరాలు సేకరించారు. అంతేగాకుండా డ్యాం నిర్మాణం మొదలుకుని ఆ తర్వాత నిర్వహణ, ఇప్పటి వరకు డ్యాంను పరిశీలించిన నిపుణులు ఇచ్చిన నివేదికలు, ఇప్పటిదాకా చేపట్టిన మరమ్మతులు తదితర రికార్డులను కూడా పరిశీలించారు.

డ్యాం భద్రతపై సీడబ్ల్యూసీ దృష్టి

తుంగభద్ర డ్యాం భద్రతపై కేంద్ర జలసంఘం దృష్టి సారించింది. అదే సమయంలో కొట్టుకుపోయిన 19వ నెంబరు గేటుతో పాటు 33 గేట్ల భద్రతపై అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేలా నిపుణుల కమిటీని నియమించాలంటూ తుంగభద్ర బోర్డు సెక్రటరీ ఒ.రామకృష్ణా రెడ్డి నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీకి లేఖ రాశారు. సీడబ్ల్యూసీ మాజీ ఛైర్మన్ ఏకే బజాజ్ నేతృత్వంలో హైడ్రో మెకానికల్, ఎలక్ట్రికల్ సేఫ్టీ ఎక్స్‌పర్ట్ హర్కేష్ కుమార్, తారాపురం సుధాకర్‌లతో పాటు బోర్డులో భాగస్వామ్యమైన ఏపీ, కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాలు సూచించిన ప్రతినిధులతో నిపుణుల కమిటీని నియమించింది. ఆ కమిటీ డ్యాంను సమగ్రంగా పరిశీలించింది. ఏపీ నుంచి బోర్డు సభ్యుడు, సీఈ నాగరాజు, తెలంగాణ నుంచి ఈఈ బాలమురళీకృష్ణ, డ్యాం సేఫ్టీ రిటైర్డ్ ఎస్ఈ సుధాకర్, కర్ణాటక రిటైర్డ్ సెక్రటరీ సిద్ధగంగప్ప బృందంగా పర్యటించారు. ఆనకట్టపై ఉన్న షట్టర్లతో పాటు రాతి కట్టడాన్ని ఉదయం నుంచి రాత్రి వరకు క్షుణ్ణంగా పరిశీలించారు. గైడ్ యాంగిల్, కౌంటర్ వెయిట్‌లను పరిశీలించిన అనంతరం రాతికట్టడాన్ని చూశారు. 70 ఏళ్ల క్రితం డ్యాం నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన క్రస్ట్ గేట్ల మందాన్ని అధ్యయనం చేశారు. నీటి అలల ఒత్తిడికి షట్టర్లు మందంలో తేడా వచ్చిందా (అరిగాయా..?) అని ఆరాతీశారు. మంగళవారం కూడా క్రస్టు గేట్లు, గ్యాలరీ, హైడ్రో మెకానికల్, ఎలక్ట్రికల్ సిస్టమ్‌ను సమగ్రంగా పరిశీలిస్తారు.

తుంగభద్ర జలాశయానికి ఈ ఏడాది ముందుగానే వరదలు మొదలయ్యాయి. జూలై నెలలోనే గరిష్ఠ నీటి మట్టం 1,633 అడుగులు, పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలకు వరద చేరి, ఆ పైన లక్షల క్యూసెక్కుల వరద ఉండటంతో 33 గేట్లు ఎత్తి నదికి నీటిని విడుదల చేశారు. దాదాపు 200 టీఎంసీలు తుంగభద్ర డ్యాం నుంచి శ్రీశైలానికి వదిలారు. ఆగస్టు 10వ తేదీ నాటికి వరద తగ్గిపోవడంతో 1,633 అడుగుల లెవల్‌లో 105.788 టీఎంసీలు పూర్తి స్థాయి సామర్థ్యంలో ఎత్తిన గేట్లను డ్యాం ఇంజనీర్లు దించారు. ఆ సమయంలో 19వ నెంబరు గేటు చైన్‌లింక్ తెగిపోయి భారీ శబ్దంతో క్రస్టు గేటు వరద ఉధృతికి కొట్టుకుపోయింది. డ్యాం భద్రత దృష్ట్యా క్రస్ట్ లెవల్ 1,613 అడుగుల వరకు ఖాళీ చేయాల్సి వచ్చింది. అదే జరిగితే కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమకు చెందిన కర్నూలు, అనంతపురం జిల్లాల రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడేది. ఆ సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డ్యాం భద్రత దృష్ట్యా క్రస్టు గేట్ల నిపుణుడు కన్నయ్య నాయుడు, రాష్ట్ర మంత్రులు నిమ్మల రామనాయుడు, పయ్యావుల కేశవ్‌లను డ్యాంకు పంపించి మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. సీఎం చంద్రబాబు ఆలోచనతో కన్నయ్య నాయుడు సారథ్యంలో స్టాఫ్‌లాగ్ ఎలిమెంట్స్ ఏర్పాటుకు కృషి చేశారు.



తుంగభద్ర డ్యాంను పరిశీలిస్తున్న నిపుణుల కమిటీ సభ్యులు

ఒక్క దరఖాస్తు కూడా రీ ఓపెన్ కాకూడదు

- సీఎంవో ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం తగదు
- కలెక్టర్ పి. రంజిత్ బాషా



కలెక్టర్‌తో మాట్లాడుతున్న మహిళలు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 9: ఫిర్యాదులకు సంబంధించి ఒక్క దరఖాస్తు కూడా రీఓపెన్ కాకూడదని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రీఓపెన్, ఇంకా చూడనివి, గడువు దాటిన కేసులపై సమీక్షించారు. రీఓపెన్ 37, ఇంకా చూడనివి 21, సీఎం గ్రీవెన్స్ 34, గడువు దాటినవి ఒక్క ఫిర్యాదు ఉన్నాయన్నారు. ఆదోని సబ్ కలెక్టర్, పత్తికొండ కర్నూలు ఆర్డీవోలు, డీపీవో, హౌసింగ్, కేసులు పంచాయతీ రాజ్ తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు రీఓపెన్ అయ్యాయని, వీటిని వెంటనే పరిష్కరించాలనిఆదేశించారు. ఆర్డీసీ, డీపీవో, వక్ఫ్, పంచాయతీరాజ్, ఆర్ఐవో, కర్నూలు, దేవనకొండ, ఎంపీడీవో కార్యాలయాలు, తదితర శాఖలన్నీ జాబితాలో ఉన్నాయని, వెంటనే వాటిని చూసి సమస్యలను పరిష్కరించాలన్నారు. సీఎంవో ఫిర్యాదులకు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏడు, కర్నూలు ఆర్డీవో కార్యాలయంలో ఏడు అత్యధికంగా పెండింగ్‌లో ఉన్నాయని, సీఎంవో గ్రీవెన్స్ పరిష్కారంలో అలసత్వం ఉండకూడదని అధికారులను హెచ్చరించారు.

- **వంద రోజుల లక్ష్యాలను సాధించేలా ప్రణాళిక:** జిల్లా అభివృద్ధిలో భాగంగా వంద రోజుల లక్ష్యాలను మండల వారిగా విభజించి నిర్ణయించామని, ఈ లక్ష్యాల సాధనకు వీలుగా కార్యాచరణ ప్రణాళికను త్వరితగతిన అమలు చేయాలని జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవోలు, తహసీల్దార్లు, జిల్లా స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేస్తామని, సమీక్షకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, డీఆర్వో చిరంజీవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వర్క్ అడ్జెస్ట్‌మెంట్ టీచర్ మాకొద్దు

బడికి తాళం వేసిన గ్రామస్థులు



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కోడుమూరు (రూరల్), సెప్టెంబరు 9: మండలంలోని ఖైనదొడ్డి ప్రాథమిక పాఠశాలకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద జరీనా అనే టీచర్‌ను పంపడం తగదని సోమవారం ఉదయం విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాఠశాలకు తాళం వేసి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా పాఠశాల వైస్ ఛైర్మన్ బాలకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు వీరేంద్ర, దస్తగిరి, శ్రీనివాసులు, వీరేష్ తదితరులు మాట్లాడుతూ వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద టీచర్‌ను పంపుతున్నట్లు తెలిసిందని అన్నారు. దీన్ని తాము సహించబోమని, విద్యాశాఖాధికారులు స్పందించి తమ పాఠశాలకు పూర్తిస్థాయిలో విధులు నిర్వహించే టీచర్‌ను పంపించాలని కోరారు. లేకపోతే తమ పిల్లల్ని పాఠశాలకు పంపించబోమని తేల్చి చెప్పారు. పాఠశాల హెచ్ఎం సునీతకుమారి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని హామీ ఇవ్వడంతో పాఠశాల తాళాలు తెరిచారు.

విచారణ జరిపి న్యాయం చేస్తాం

- ఎస్పీ జి. బిందు మాధవ్
- పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 96 సమస్యలు

కర్నూలు, సెప్టెంబరు 9: స్థానిక కొత్తపేటలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన సమస్యపై విచారణ జరిపి న్యాయం చేస్తామని ఎస్పీ జి.బిందు మాధవ్ అన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ జి.బిందు మాధవ్

- ఎమ్మిగనూరు యూనియన్ బ్యాంకులో బిజినెస్ కరస్పాండెంట్‌గా పని చేస్తున్న తన ఫోన్ నెంబర్‌కు మే 17న సైబర్ నేరస్థులు ఫోన్ చేసి మొబైల్ బ్యాంక్ యాప్ ద్వారా రూ.5 లక్షలు ఆన్‌లైన్‌లో ఫ్రాడ్ చేశారని ఎమ్మిగనూరు మండలం, కోటేకల్లు గ్రామానికి చెందిన ఇబ్రహీం ఫిర్యాదు చేశారు.
- కర్నూలు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో తన కుమారుడికి, కుమార్తెకు ఉద్యోగాలు ఇప్పిస్తామని కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన ఆయేషాబేగం, జహీర్ రూ.5.75 లక్షలు తీసుకుని మోసం చేశారని కర్నూలు వివేక్ నగర్‌కు చెందిన ఉదయ్ కుమార్ ఫిర్యాదు చేశారు.
- ప్యాలకుర్తికి చెందిన రాజు రూ.25 వేలు ఇస్తే రూ.8 లక్షలు స్పాట్‌లోన్ ఇప్పిస్తామని చెప్పి నమ్మించి ఫోన్‌పే ద్వారా డబ్బులు తీసుకుని మోసం చేశాడని దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామానికి చెందిన సంజన్న ఫిర్యాదు చేశారు.
- వరి ధాన్యం కొనుగోలు చేసిన జి. సింగవరం గ్రామానికి చెందిన మల్లికార్జున శెట్టి నాలుగు సంవత్సరాల నుంచి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కర్నూలుకు చెందిన రవికుమార్ ఫిర్యాదు చేశారు.
- ఆస్తి కోసం తన పెద్ద కుమారుడు కాశన్న, కోడలు సుగుణమ్మ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎమ్మిగనూరు, ఎర్రకోట గ్రామానికి చెందిన సుంకమ్మ ఫిర్యాదు చేశారు.
- ఆర్ఎంపీ పాత కక్షలతో గుర్తు తెలియని వ్యక్తులచే ఫోన్ కాల్స్ చేయించి బెదిరిస్తున్నాడని దిన్నెదేవరపాడు గ్రామానికి చెందిన రవితేజ ఫిర్యాదు చేశారు.
- తనకున్న ఐదు ఎకరాలలో 1.16 ఎకరాల భూమిని అక్రమంగా ఆన్‌లైన్ చేసుకోవడమే కాకుండా సుధాకర్ అనే వ్యక్తి కొట్టి గాయపరిచాడని వెల్దుర్తి మండలం బింగిదొడ్డి గ్రామానికి చెందిన వెంకట్రాముడు ఫిర్యాదు చేశారు.
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ జి. బిందుమాధవ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సీఐ గుణశేఖర్‌బాబు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలన ఆదర్శవంతం

మంత్రి టీజీ భరత్



కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 9: సీఎం చంద్రబాబు నాయుడు ఆదర్శవంతమైన పాలన సాగిస్తున్నారని మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేస్తే వర్గాలకు అతీతంగా రాష్ట్ర ప్రజలందరూ ఖండించారని గుర్తు చేశారు. దేశ వ్యాప్తంగా మద్దతు పలికారని, అరెస్టు అయిన ఏ రాజకీయ నేతకు ఇలాంటి సంఘీభావం రాలేదన్నారు. 4 దశాబ్దాలుగా ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తూ ఎలాంటి మచ్చలేని చంద్రబాబును వైసీపీ ప్రభుత్వం తప్పుడు కేసులతో ఏడాది క్రితం అరెస్టు చేయించిందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఒక్క రూపాయి అవినీతిని కూడా వైసీపీ నిరూపించలేకపోయిందన్నారు.

చంద్రబాబు అరెస్టుతో వైసీపీ పతనం


ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



కర్నూలు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుతోనే వైసీపీ పతనం మొదలైందని ఎమ్మిగనూరు టీడీపీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఎమ్మిగనూరులో విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలన టెర్రరిస్టు విధానాలను తలపించిందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమంతోపాటు తెలుగు ప్రజల ఆత్మగౌరవ పరిరక్షణ కోసం పరితపించిన చంద్రబాబును జగన్ ప్రభుత్వం అరెస్టు చేయడంతో ప్రజల్లో ఆగ్రహం రగిలిందన్నారు. అరెస్టు చేసి టీడీపీని దెబ్బతీయాలని వైసీపీ కక్ష కడితే ప్రజలు జగన్‌కు, ఆ పార్టీకి గోరీ కట్టారని ధ్వజమెత్తారు. చంద్రబాబు బాటలోనే నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటు పడుతామన్నారు.

టెర్రరిస్టు పాలనను తలపించిన జగన్

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 9: గత ఐదేళ్లలో జగన్మోహన్‌రెడ్డి టెర్రరిస్టు పాలనను తలపించాడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. సోమవారం ఆయన విడుదల చేసిన ఓ ప్రకటనలో.. రాజకీయ కక్షతో ఎలాంటి అవినీతికి పాల్పడకపోయినా చంద్రబాబుపై కుట్రలు పన్ని అధికారాన్ని అడ్డు పెట్టుకుని జగన్ సీఐడీ ద్వారా అరెస్టు చేయించడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. గత ఎన్నికల్లో ప్రజలు కూడా 11 సీట్లకే పరిమితం చేసి ప్రతి పక్ష హోదా లేకుండా చేసినప్పటికీ జగన్ రెడ్డికి జ్ఞానోదం కాలేదని అన్నారు.

చంద్రబాబు అరెస్టుకు ఏడాది

టీడీపీ నంద్యాల అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



మాట్లాడుతున్న నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, సెప్టెంబరు 9: టెర్రరిస్టు పాలనను తలపించేలా ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజా నాయకుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అరెస్టు చేసి ఏడాదైందని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం ధ్యేయంగా పని చేశారన్నారు. అక్రమ అరెస్టుకు నిరసనగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సంఘీభావం ప్రకటించాయని తెలిపారు. దేశ వ్యాప్తంగా మద్దతు పలికారని, 70 దేశాల్లో చంద్రబాబుకు సంఘీభావం ప్రదర్శనలు చేశారని అన్నారు. చంద్రబాబు విడుదలైన రోజు రాజమండ్రి నుంచి విజయవాడ చేరడానికి రాత్రంతా జనం రోడ్లపై జాగరణ చేసి చంద్రబాబుకు స్వాగతం పలికారని, ఏ రాజకీయ నేతకు ఇతంటి సంఘీభావం రాలేదని పేర్కొన్నారు. అక్రమ అరెస్టుకు నిరసనగా చరిత్రలో నిలిచిపోయేలా వైసీపీకి 11 సీట్లను మాత్రమే ప్రజలు పరిమితం చేశారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బజారు, వేణు, విక్రమ్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుతోనే వైసీపీ పతనం

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 9: ఏడాది కింద చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్టు వైసీపీ పతనానికి నాందీ, కూటమి విజయానికి పునాది అయిందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా నంద్యాలకు వచ్చిన చంద్రబాబును అరెస్టు చేయడం రాష్ట్ర ప్రజలను క్షోభకు గురి చేసిందన్నారు. దీంతో గత ఎన్నికల్లో 164 అసెంబ్లీ, 21 పార్లమెంట్ సీట్లలో కూటమికి ప్రజలు పట్టం కట్టారని అన్నారు.

యాగంటిపల్లె కేవీకేకు జాతీయ స్థాయి అవార్డు

బనగానపల్లె, సెప్టెంబరు 9: యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రానికి జాతీయ స్థాయిలో అత్యుత్తమ అవార్డు లభించింది. కేవీకే సీనియర్ సైంటిస్టు, హెడ్ ధనలక్ష్మి సోమవారం ఈ అవార్డును ఢిల్లీలో అందుకున్నారు. ఢిల్లీలో అవుట్‌లుక్ అగ్రిటెక్ సమ్మిట్, అవార్డు 2024కు గాను ఏపీ షిండే ఆడిటోరియంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. అవార్డు అందుకున్న సీనియర్ సైంటిస్టు ధనలక్ష్మి మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన ఈ సమ్మిట్‌లో అద్భుతమైన వ్యవసాయ ఆవిష్కరణలను ప్రదర్శించడంతో పాటు భవిష్యత్ వ్యవసాయం అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన వ్యవసాయ రంగ మార్పులపై చర్చించినట్లు తెలిపారు. ఈ అవార్డు రావడం పట్ల కేవీకే సెక్రటరీ పెండేకంటి బాలాజీ అభినందించారు. ఢిల్లీలో జరిగిన ఈసమావేశంలో ఔట్‌లుక్ సీఈవో చంద్రనీల్‌రాయ్, ధనూక సీఈవో స్వరాజ్, రామ్‌గోపాల్ అగర్వాల్ పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న కేవీకే సీనియర్ సైంటిస్టు ధనలక్ష్మి

కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నిరసన

జీవో నెం.115ను రద్దు చేయాలి

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 9: కాంట్రాక్టు స్టాఫ్ నర్సులకు గుదిబండలా మారిన జీవో.నెం.115ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కోరుతూ సోమవారం ఉమ్మడి జిల్లాలోని కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. జీఎన్ఎం ట్రైనింగ్ చేసిన వారికి రెగ్యులర్ స్టాఫ్ నర్సులుగా ఎలా పోస్టులు ఇస్తారని ఏపీ గవర్నమెంటు నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకురాలు డి.మంజులాదేవి ప్రశ్నించారు. గత ప్రభుత్వం తప్పిదం చేసిందని, కూటమి ప్రభుత్వం జీవో నెం.115ను రద్దు చేసి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 11వేల మంది కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు 14 ఏళ్లుగా పని చేస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టు స్టాఫ్ నర్సు నిర్మలారాణి మాట్లాడుతూ జీఎన్ఎం శిక్షణ పొందిన వారికి రెగ్యులర్ స్టాఫ్ నర్సుల పోస్టులు ఇవ్వడం అన్యాయమని, ఏఎన్ఎంలు ఇప్పటికే రెగ్యులర్ పోస్టు ల్లో ఉన్నారని గుర్తు చేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమ ర్పించారు ఉమ్మడి జిల్లాలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రులు, నంద్యాల, కర్నూలు జీజీహెచ్ ఆసుపత్రుల కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

హంద్రీ, కేసీ కెనాల్‌ను కాపాడుకుందాం

- హంద్రీ, కేసీ కెనాల్ పరిరక్షణ కమిటీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి
- దురాక్రమణ వల్లే హంద్రీ మాయం: చంద్రశేఖర కల్కూర

కర్నూలు (కల్చరల్), సెప్టెంబరు 9: హంద్రీ నది, కేసీ కెనాల్‌లను పరిరక్షించుకోడానికి పోరాడాలని, లేకపోతే విజయవాడలో బుడమేరు దురాక్రమణ వల్ల వరదలు వచ్చినట్లే కర్నూలుకు ప్రమాదం పొంచి ఉంటుందని హంద్రీ, కేసీ కెనాల్ పరిరక్షణ కమిటీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం హంద్రీ, కేసీ కెనాల్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో హంద్రీ నది, కేసీ కెనాల్‌లను కాలుష్యం నుంచి, ఆక్రమణల నుంచి కాపాడాలని, కర్నూలును స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దాలని కోరుతూ నగరంలోని జడ్పీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ముందు గల మహాత్ముని విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. అంతక ముందు ర్యాలీని ప్రారంభించిన గ్రంథాలయోద్యమ నాయకుడు, రచయిత చంద్రశేఖర్ కల్కూర మాట్లాడుతూ గత ఇరవై ఏళ్ల క్రితం హంద్రీ, కేసీ కాలువలో స్వచ్ఛమైన నీరు పారేదని, దురాక్రమణల వల్ల ఇప్పుడు హంద్రీ మాయమై పోయిందని అన్నారు. కేసీలో నగరంలోని చెత్త అంతా వేయడం వల్ల కాలుష్యం పెరిగిపోయి, నగరంలో దోమలు పెరిగాయని అన్నారు. స్వచ్ఛ కర్నూలును సాధించే వరకు ఉద్యమం జరగాలని, అధికారులపై, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ హంద్రీనదిలో చెత్తాచెదారం, కంపచెట్లు, పూడిక తొలగించి, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హంద్రీ నదికి రక్షణ గోడ నిర్మించాలని కోరారు. రైతుకూలీ సంఘం నాయకుడు రామకృష్ణ, సీపీఐ కార్యదర్శి మునెప్ప మాట్లాడుతూ హంద్రీనది నగరంలో ఆక్రమణలకు గురవుతోందని, అనధికార ఆక్రమణలను అరికట్టాలని కోరారు. కేసీ కెనాల్ వెంట ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి, యుద్ధ ప్రాతిపదికన హంద్రీ నదిని శుభ్రం చేయాలని, వరదల నివారణకు రక్షణ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రజాభ్యుదయ నాయకుడు భార్గవ, జేవీవీ నాయకుడు శేషాద్రిరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనం ప్రజల హక్కు అని, కేసీ, హంద్రీల వల్ల నేడు ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, ఆరోగ్య పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. కేసీ కాలువలో మురుగునీరు కలువకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు చాంద్‌బాషా, డేవిడ్, సుంకన్న, నాగన్న, శ్రీనివాసరావు, విరసం బాధ్యుడు పాణి, పౌర హక్కుల నాయకుడు అల్లాబకాష్, కరీంబాషా, రవికుమార్, యోహాను, మనోహర్ మాణిక్యం, డీటీఎఫ్ నాయకుడు రత్నం ఏసేపు, కేవీపీఎస్ సభ్యులు సుబ్బరాయుడు, భాస్కర్‌రెడ్డి, జహంగీర్, ఆరిఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



హంద్రీ, కేసీ కెనాల్‌ను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ కర్నూలు కలెక్టరేట్ ఎదుట ర్యాలీ నిర్వహిస్తున్న పరిరక్షణ కమిటీ సభ్యులు, నాయకులు

పంటల బీమాకు గ్రీన్ సిగ్నల్

- వాతావరణ బీమా కింద పత్తి, వేరుశనగ ఎంపిక
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 9: ఈ ఆర్థిక సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో సాగైన ప్రధాన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అమలు చేసేందుకు మార్గదర్శకాలు రూపొందించి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు జిల్లా వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయానికి చేరాయి. ఈ ఉత్తర్వుల ప్రకారం రైతులు కట్టాల్సిన ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించనుంది. మిగిలిన మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి. దీంతో ఈ-పంటలో నమోదు చేసుకోవడంతో పాటు ఈకేవైసీ చేయించుకున్న రైతులందరికీ ఉచిత పంటల బీమా వరించనుందని జేడీ వరలక్ష్మి తెలిపారు. గ్రామం యూనిట్‌గా వరికి పంటల బీమాను వర్తింపజేశారని, అదేవిధంగా వాతావరణ బీమా కింద జిల్లాలో ప్రధానంగా సాగవుతున్న పత్తి, వేరుశనగ పంటలను ఎంపిక చేసినట్లు ఆదివారం విలేకరులకు తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 1.80 లక్షల హెక్టార్లలో పత్తి పంటను రైతులు సాగు చేశారు. వేరుశనగ పంట దాదాపు 70 వేల ఎకరాల్లో సాగైంది. వాతావరణ బీమా కింద ఎంపిక చేసిన వేరుశనగ పంటకు వచ్చే నెలాఖరు వరకు అదే విధంగా పత్తి పంటకు నవంబరు 31 వరకు రైతులు బీమా చేసుకునేందుకు అవసరమైన దరఖాస్తులు నమోదు చేయాల్సి ఉంటుంది. పత్తి పంటకు హెక్టారుకు రూ.లక్ష చొప్పున, వేరుశనగ పంటకు రూ.70వేలకు బీమా వర్తిస్తుంది. కర్నూలు జిల్లాలో వరితో పాటు మండలం యూనిట్‌గా కంది, ఎండుమిర్చి, ఆముదం, జొన్న పంటలను చేర్చారు. జిల్లా యూనిట్‌గా సజ్జ, కొర్ర, ఉల్లి పంటలను చేర్చారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో గ్రామం యూనిట్‌గా వరి, మండలం యూనిట్‌గా మొక్కజొన్న, ఎండుమిర్చి, కంది, మినుము పంటలను చేర్చారు. జిల్లా యూనిట్ పరిధిలో కొర్ర, సజ్జ, ఆముదం జొన్న పంటలను చేర్చారు.

వంద రోజుల ప్రణాళిక లక్ష్యాలను అధిగమించండి

కలెక్టర్ రాజకుమారి



నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 9: వంద రోజుల ప్రణాళిక లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ వేదికలో భాగంగా క్షేత్ర స్థాయిలో వంద రోజుల పనుల ప్రగతి లక్ష్యాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ పనితీరు మెరుగు పరుచుకొని నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పనుల లేబర్ బడ్జెట్, ఇళ్ల నిర్మాణాల పురోగతి, పంట నష్టం నమోదు, ఈ క్రాప్ బుకింగ్, ఓడీఎఫ్ ప్లస్ సర్వే తదితర అంశాలలో నిర్దేశించిన ప్రగతి లక్ష్య సాధనలో కొంతమంది మండల అధికారులు తక్కువ ప్రగతి సాధిస్తున్నారని అన్నారు. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల తదితర మండలాల్లో ఉపాధి హామీ కింద 1,100 ఎకరాల్లో చేపట్టిన పండ్ల తోటల పెంపకాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ఈ ప్రణాళికలో 3,413 ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు 608 ఇళ్లు మాత్రమే పూర్తి చేయగలిగామన్నారు. పంట నష్ట వివరాలపై మంగళవారంలోగా నివేదిక ఇవ్వాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైతులకు సంబంధించి ఈకేవైసీ పూర్తి చేసేవిధంగా గ్రామ వ్యవసాయ అధికారులు, వీఆర్వోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి వాస్తవ నివేదికలను వెంటనే పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డేటా బేస్ ప్రకారం పల్స్ ఓడీఎఫ్ ప్లస్ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. 151 సంక్షేమ వసతి గృహాల్లో తనిఖీల నిమిత్తం స్పెషల్ అధికారులను నియమించామని, సంబంధిత అధికారుల నివేదిక ఆధారంగా హాస్టల్లో అన్ని మౌలిక వసతులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు.

నిమజ్జనంలో అపశ్రుతి

తెలుగు గంగ కాలువలో బాలుడి గల్లంతు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 9: అహోబిలం గ్రామంలో సోమవారం చేపట్టిన గణేశ్ నిమజ్జనం కార్యక్రమంలో అపశ్రుతి చోటు చేసుకుంది. తెలుగు గంగ కాలువలో పడి ఓ బాలుడు గల్లంతయ్యాడు. వినాయక చవితి పండుగ రోజున అహోబిలంలోని కొందరు బాలురు చందాలు వేసుకొని గణేశ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. మూడు రోజులపాటు చేసిన పూజలనంతరం తెలుగు గంగ క్వార్టర్స్ సమీపంలో ఉన్న తెలుగు కాలువలో నిమజ్జనం చేసేందుకు తీసుకెళ్లారు. విగ్రహాన్ని నిమజ్జనం చేసే సమయంలో ప్రమాదవశాత్తు నలుగురు బాలురు కాలువలో పడిపోయారు. అక్కడే ఉన్న గ్రామస్తులు వెంటనే ముగ్గురిని రక్షించారు. వీరిలో అహోబిలం గ్రామానికి చెందిన దస్తగిరి కుమారుడు లాల్‌బాషా (12) గల్లంతయ్యాడు. బాలుడి కోసం గజ ఈతగాళ్లు ముమ్మరంగా గాలిస్తున్నారు. అలాగే పట్టణంలోని ఆశ్రమం వీధిలోని గంగమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన మండపంలోని గణేశ్ విగ్రహం వద్ద సందడి చేసుకుంటుండగా అశోక్(32) కుప్పకూలిపోయాడు. ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించేలోపే మృతి చెందాడు. దీంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



లాల్‌బాషా(ఫైల్)

అతిసారతో వృద్ధురాలు మృతి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 9 : ఆళ్లగడ్డ పట్టణంలోని చాంద్ వీధిలో నివాసం ఉంటున్న ఇమాంబీ (70) అతిసారతో సోమవారం మృతి చెందింది. ఈమె గత పది రోజుల నుంచి ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. ఈమెతోపాటు అదే వీధిలో నివాసం ఉంటున్న మరో ఐదుగురు అతిసారతో ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు.



ఇమాంబీ(ఫైల్)

17 నుంచి స్వచ్ఛత సేవా కార్యక్రమాలు

కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 9: ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛత సేవా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వచ్ఛత సేవ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గవర్నమెంటు ఆఫ్ ఇండియా సూచనల మేరకు ప్రతి సంవత్సరం స్వచ్ఛత సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఈవోఆర్‌డీఎస్, డీఎల్పీవోలు, జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో భాగస్వామ్యం కావాలన్నారు. 2024లో స్వభావ్ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత అనే నినాదంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఇన్‌చార్జి డీఆర్వో చిరంజీవి, డీపీవో నాగరాజు నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి రైతు ఆత్మహత్య

తుగ్గలి, సెప్టెంబరు 9: అప్పుల బాధతో రైలు కింద పడి సోమవారం ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మండల పరిధిలోని జొన్నగిరికి చెందిన హనుమన్న (59) సొంత పొలం నాలుగున్నర ఎకరాలతో పాటు 15 ఎకరాలు కౌలుకు తీసుకుని ఆముదం, పత్తి, కంది, వేరుశనగ పంటలు సాగు చేశాడు. ఇలా నాలుగేళ్ల నుంచి ఏటా సాగు చేసిన పంటలు అప్పులే మిగిల్చాయి. దీంతో దాదాపు రూ.15 లక్షలు అప్పులయ్యాయి. వాటిని ఎలా తీర్చాలో అర్థంగాక ఆదివారం ఇల్లు విడిచిపెట్టి వెళ్లాడు. ఈ క్రమంలోనే సోమవారం అనంతపురం జిల్లా జక్కలచెరువు సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు హుటా హుటిన సంఘటనా స్థలానికి వెళ్లి బోరున విలపించారు. భార్య జమునమ్మ ఫిర్యాదు మేరకు గుత్తి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. టీడీపీ నాయకులు మిద్దె రవికుమార్, సర్పంచ్ ఓబులేసు, బాలన్న, శేఖర్, గ్రామస్థులు రఘు రైతు భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

ట్రాక్టర్ ఢీకొని వివాహిత మృతి

గోనెగండ్ల, సెప్టెంబరు 9: మండల పరిధిలోని ఐరన్ బండ గ్రామంలో సోమవారం ట్రాక్టర్ ఢీకొని బోయ జయశ్రీ(29) మృతి చెందింది. ఐరన్ బండ గ్రామానికి చెందిన బోయ జయశ్రీ సోమవారం ఉదయం గొల్ల పద్మావతి అనే మహిళతో కలిసి వలిబాషా అనే రైతు వేరుశనగ పొలంలో కూలీ పని చేసేందుకు బయలుదేరింది. మార్గమధ్యంలో ఆంజనేయస్వామి రస్తా, ముల్లా చిన్నవలికి చెందిన పొలం దగ్గర వెనుక వైపు నుంచి అతివేగంగా ట్రాక్టర్ వచ్చి బోయ జయశ్రీని ఢీకొంది. దీంతో జయశ్రీ ఎగిరి రోడ్డుపై పడిపోయింది. చుట్టుపక్కల వారు గమనించి జయశ్రీని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలికి భర్త ముగ్గురు సంతానం ఉన్నారు. మృతురాలి భర్త బోయ రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

రుద్రవరం, సెప్టెంబరు 9 : మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన విజయలక్ష్మి (39) అనే మహిళ విష పదార్థం తిని సోమవారం ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్ఐ శోభన్‌బాబు వివరాల మేరకు.. ఎవరూ లేని సమయంలో ఇంట్లో విష పదార్థం తీసుకోగా చుట్టుపక్కల వారు గమనించి ఆదివారం రాత్రి ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అర్ధరాత్రి దాటిన తరువాత చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. మృతురాలికి భర్త శ్రీను, ఇద్దరు కుమారులు ఉన్నారు. నరసాపురం గ్రామానికి చెందిన విజయలక్ష్మికి నంద్యాల పట్టణంలోని భారత్‌నగర్‌కు చెందిన శ్రీనుతో 16 ఏళ్ల క్రితం పెళ్లి అయింది. మృతురాలి తల్లి నాగేంద్రమ్మ తమ కుమార్తె కొంత కాలం నుంచి కడుపు నొప్పితో బాధపడుతుండేదని, జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగిందని ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- రూ.9 లక్షలు, హైచర్ లారీ, జైలో వాహనం స్వాధీనం
- పరారీలో మరో నలుగురు



నిందితులను మీడియా ముందు హాజరు పరిచిన పోలీసులు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు9: సంచలనం రేపిన జీఆర్‌పీ ఎత్తిపోతల పథకాల పంప్‌హౌస్‌ల ధ్వంసం, దొంగతనం కేసుల్లో అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎమ్మిగనూరు ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాస ఆచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రలోని బీడ్ జిల్లా సిందువాడి గ్రామానికి చెందిన కరన్‌సరవదే, పర్భాని జిల్లాకు చెందిన ఖాదరాబాద్ మజీద్‌కు చెందిన ఖరీముద్దీన్, అదే జిల్లా పర్భాని పట్టణానికి చెందిన షేక్ జహీర్‌లతోపాటు మరో నలుగురు మంత్రాలయం, మాధవరం, కోసిగి, ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని నందవరం మండలం తుంగభద్ర నది పరివాహక ప్రాంతాల్లో ఉన్న గురురాఘవేంద్ర లిఫ్ట్ ఇరిగేషన్ పంపుసెట్లను రెండు నెలల క్రితం పగులగొట్టారు. అందులో ఉన్న రాగి వైరు, రాగి ప్లేట్లు, ఆయిల్‌ను దొంగలించారు. ఈ విషయంపై ఇరిగేషన్ అధికారులు ఆయా పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. ఈ చోరీ ఘటనలపై మంత్రాలయంలో మూడు కేసులు, నందవరంలో మూడు కేసులు, కోసిగిలో ఒక కేసు, అలాగే నంద్యాల జిల్లా డోన్, కడప జిల్లా కమలాపురంలో ఒక్కో కేసు నమోదయ్యాయి. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడమేకాకుండా రైతులకు లిఫ్టుల ద్వారా సాగు నీరు అందించే యంత్రాలను దొంగలు పగులగొట్టి నిర్వీర్యం చేశారు. దీంతో నదీ పరివాహక ప్రాంతాల్లో సాగు భూములకు సకాలంలో నీరు అందించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటనలపై ఎస్పీ బిందుమాధవ్ ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన పర్యవేక్షణలోనే ఎమ్మిగనూరు ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాస ఆచారి ఆధ్వర్యంలో కర్నూలు స్పెషల్ బ్రాంచ్ సీఐ, కర్నూలు సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శేషయ్య, కర్నూలు సైబర్‌సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు నేతృత్వంలో తగిన సిబ్బందితో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక బృందం పలు ప్రాంతాల్లో పర్యటించి పంప్‌హౌస్‌లను పగులగొట్టి అందులోని రాగివైర్లు, ప్లేట్లు, ఆయిల్‌ను దొంగతనం చేసిన వారిని మహారాష్ట్ర గ్యాంగ్‌గా గుర్తించింది. ఈ గ్యాంగులోని ముగ్గురు తిరిగి దొంగతనం చేసేందుకు ఏపీ వైపు వస్తున్నారన్న సమాచారం అందడంతో నందవరం మండలం నాగలదిన్నె బ్రిడ్జి దగ్గర ఎమ్మిగనూరు రూరల్, మంత్రాలయం సీఐలు విక్రమ్‌సింహ, రామాంజులు, నందవరం ఎస్ఐ శ్రీనివాసులు, మాధవరం ఎస్ఐ విజయ్‌లు నిందితుల ఫోన్‌కాల్ ఆధారంగా మాటువేసి అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.9 లక్షల నగదు, ఎంహెచ్ 22, ఏఎన్ 1154 హైచర్ లారీ, ఎంహెచ్ 23 ఈ 8141 మహేంద్ర జైలో జీపుతోపాటు 25 కేజీల కాపర్ వైరును స్వాధీనం చేసుకున్నారు. గ్యాంగ్‌లో ఉన్న మరో నలుగురు దొంగలు పరారీ ఉన్నారు. సమావేశంలో రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, ఇరిగేషన్ అధికారులు శంకర్, ప్రేమ్, హరి, ప్రసాద్, సయ్యద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వినాయక నిమజ్జనం


కోడుమూరులో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు


గోరంట్లలో..

కోడుమూరు, సెప్టెంబరు 9: పట్టణంలో వాడవాడల్లో మూడు రోజుల పాటు పూజలు అందుకొన్న గణనాథుడిని భక్తులు సోమవారం సాయంత్రం నిమజ్జనం చేశారు. ఎస్‌ఐ ఏపీ శ్రీనివాసులు ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచు భాగ్యరత్న, ఎంపీడీవో చంద్రశేఖర్, ఇన్‌చార్జి తహసీల్దార్ రామాంజనేయులు, ఏఎస్‌ఐ సురేంద్ర నిమజ్జన పూజా పాల్గొన్నారు.

భక్తులకు వాటర్ బాటిళ్లు: వినాయక నిమజ్జన ఊరేగింపు కార్యక్రమంలో భక్తులకు టీడీపీ నాయకులు వాటర్ బాటిళ్లను అందించారు. స్థానిక పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వాటర్ బాటిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఎస్‌ఐ ఏపీ శ్రీనివాసులు ప్రారంభించారు. అనంతరం భక్తులకు వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు.

కోడుమూరు(రూరల్): మండలంలోని వెంకటగిరి, గోరంట్ల, లద్దగిరి, వర్కూరు, ముడుమలగుర్తి, క్రిష్ణాపురం, బైనదొడ్డి, పులకుర్తి గ్రామాల్లో వినాయక నిమజ్జనం జరిగింది. వర్కూరులో ఓ ముస్లిం కుటుంబం వినాయక చవితి వేడుకలను నిర్వహించి మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. స్థానిక ఖాజాహుస్సేన్‌స్వామి వంశీయులు దర్గా ప్రాంగణంలో వినాయక విగ్రహాన్ని కొలువుంచి మూడురోజులుగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

వినాయకుడి లడ్డూ రూ.36వేలు: మండలంలోని లద్దగిరి పట్టెవీధిలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద 3 కిలోల లడ్డు ధర్మతేజ రూ.36 వేలకు కైవసం చేసుకున్నారు. అలాగే వర్కూరు కమ్మర కాలనీలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద 5 కిలోల లడ్డు బట్టి సుంకన్న అనే వ్యక్తి రూ 20 వేలు, కలశం రూ. 16వేలకు ఉప్పరి క్రిష్ణమూర్తి వేలం పాటలో కైవసం చేసుకున్నారు.

ఓర్వకల్లు: మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల, కేతవరం, పూడిచెర్ల, నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, హుశేనాపురం, గుట్టపాడు, శకునాల, కాల్వ తదితర గ్రామాల్లో సోమవారం వినాయక నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా మండపాల్లో ఏర్పాటు చేసిన వినాయకులకు ప్రత్యేక పూజలు చేసి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా వినాయకున్ని ట్రాక్టర్లపై ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు, మేళతాళాలతో వీధుల గుండా ఊరేగించారు.

సి.బెళగల్: మండలంలోని పోలకల్లు, సంగాల, బురాన్‌దొడ్డి, మారందొడ్డి, కంబందహాల్, చింతమానుపల్లె, తిమ్మనదొడ్డి, గుండ్రేవుల, కొండాపురం, ముడుమాల, ఇనగండ్ల, సిబెళగల్, ఈర్లదిన్నె, శింగవరం, కొత్తకోట, బ్యాళోలి, క్రిష్ణదొడ్డి, గొల్లలదొడ్డి, పలులకుదొడ్డి, పల్లెదొడ్డి, బ్రాహ్మణదొడ్డి, వైకొట్టాల గ్రామాలలో వినాయక నిమజ్జనం చేశారు. గణపతి లడ్డూ కోసం వేలంపాటు నిర్వహించారు.

గూడూరు: గూడూరు పట్టణంలో గణేష్ నిమజ్జనోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రామాంజనేయులు, మాజీ జడ్పీటీసీ ఎల్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు రేమట సురేష్, మూలగేరి దస్తగిరి, టీడీపీ యువ నాయకుడు వెంకటేష్, మల్లేష్ నాయుడు, చరణ్ కుమార్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కల్లూరు: మండలంలో ఉలిందకొండ, లక్ష్మీపురం, కె.మార్కాపురం, చిన్నటేకూరు, పెద్దటేకూరు తడకనపల్లె, బస్తిపాడు, బొల్లవరం సల్కాపురం, పర్ల గ్రామాల్లో వినాయక నిమజ్జనం ఘనంగా జరిగాయి. మూడు రోజులు మండపాల్లో నిత్య పూజలు అందుకున్న వినాయకుడు సోమవారం గంగమ్మతల్లి ఒడికి చేరాడు. వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామాల్లో స్వామి వారిని ఊరేగిస్తూ రంగులు జల్లుకుని, కోలాటాలు ఆడుకుంటూ సాంస్కృతిక కార్యక్రమాలతో యువత నృత్యం చేసుకుంటూ నిమజ్జనంలో పాల్గొన్నారు. ఉలిందకొండ, కె.మార్కాపురం గ్రామాల్లో కమిటీ సభ్యులు నిర్వహించిన వినాయక లడ్డూ వేలం పాటలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కె.రామాంజనేయులు, ఈవీ.రమణ, రంగస్వామిరెడ్డి, శ్రీకాంత్, వెంకటరమణ, విజయ్, మోహన్, నాగరాజు, చరణ్, మనోహర్, తేజనాయుడు, రామకృష్ణ పాల్గొన్నారు.

● చిన్నటేకూరు సమీపంలోని హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ గట్టుపై వినాయక నిమజ్జన ఏర్పాట్లను ఉలిందకొండ ఎస్‌ఐ ధనుంజయ పరిశీలించారు. ఉలిందకొండ టీడీపీ సీనియర్ నాయకుడు ఈవీ.రమణ పాల్గొన్నారు. ఈసందర్బంగా ఎస్‌ఐ ధనుంజయ మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.


గూడూరులో..


ఓర్వకల్లులో..


సి.బెళగల్‌లో..


కె.మార్కాపురంలో పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

అభయకు న్యాయం జరుగుతుందా..?

» కోల్‌కతా ఘటనకు 30 రోజులు
» నిరసన తెలిపిన ఐఎంఏ, గైనిక్ వైద్యులు


నిరసన తెలుపుతున్న ఐఎంఏ, గైనిక్ వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 9: కోల్‌కతా వైద్య కళాశాలలో జూనియర్ డాక్టర్ అభయపై అత్యాచార ఘటన జరిగి నెల రోజులు కావస్తున్నా దోషిని అరెస్టు చేయకపోవడాన్ని నిరసిస్తూ కర్నూలు ఐఎంఏ బ్రాంచ్ కర్నూలు గైనిక్ సొసైటీ వైద్యులు సోమవారం సాయంత్రం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట మౌన నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కర్నూలు గైనిక్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఎస్.వెంకటరమణ, రాధాలక్ష్మి, కర్నూలు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్ష, కోశాధికారులు రామచంద్ర నాయుడు, మాధవి శ్యామల మాట్లాడుతూ కోల్‌కత్తాలో అభయ కుటుంబానికి న్యాయం జరుగుతుందా? అని సందేహం వ్యక్తం చేశారు. ఈ కేసులో దోషిని ఇంత వరకు ఎందుకు అరెస్టు చేయలేదని వారు ప్రశ్నించారు.

గెస్టు అధ్యాపకుల కోసం దరఖాస్తులు

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 9: కర్నూలు ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో ఇంగ్లీషు సబ్జెక్టును బోధించేందుకు గెస్టు అధ్యాపకుల నియామకం కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సిసుంకన్న సోమవారం తెలిపారు. పీజీలో సంబంధిత సబ్జెక్టులో 50 శాతం మార్కులు కలిగి ఉండాలని, నెలకు పారితోషికం రూ.10వేలు చెల్లిస్తారని అన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 13న ఉదయం 10 గంటలకు ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో జరిగే డెమో క్లాసుకు హాజరు కావాలన్నారు.

నర్సింగ్ పరీక్షల్లో అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 9: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ సప్లిమెంటరి పరీక్షల్లో జరిగిన అవక తవకలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషాకు యూఎస్ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్ ఉదయ్ కుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులు శేఖర్ సోమవారం వినతి పత్రం అందజేశారు. విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డ్యూటీ రోస్టర్‌పై వివాదం

సూపరింటెండెంట్ యూనియన్ నాయకుల మధ్య వాదన

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 9: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో నాలుగో తరగతి సిబ్బంది (ఎంఎన్‌వో) డ్యూటీ రోస్టర్‌పై వివాదం నెలకొంది. ఏఆర్ఎంవో వేసిన డ్యూటీ రోస్టర్ సరిగ్గా లేదంటూ ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు మధ్యాహ్నం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డిని కలవడానికి వచ్చారు. దీంతో యూనియన్ రాష్ట్ర నాయకులు అబ్రహం, బాలు నాయక్, సురేష్, సూపరింటెడెంట్‌ను కలిసి డ్యూటీ రోస్టర్ గందరగోళంగా ఉందని గత 40 ఏళ్ల నుంచి సర్కంటే రోస్టర్ వేస్తున్నారని సూపరింటెండెంట్‌కు వివరించారు. సూపరింటెండెంట్ దీనిపై స్పందిస్తూ డ్యూటీ రోస్టర్‌పై తాను సంతకం చేశానని, దీన్ని మొదట అమలు చేయాలని ఏదైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తానని చెప్పారు. ఇప్పటికే డ్యూటీ రోస్టర్ 3సార్లు మార్పు చేశానని ఆయన వివరించారు.

వరద బాధితులకు కూరగాయలు



కర్నూలు మార్కెట్ యార్డు నుంచి లారీలో కూరగాయలను పంపుతున్న అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 9: కర్నూలు మార్కెట్ కమిటీ అధికారులు, కూరగాయల వ్యాపారులు విజయవాడ వరద బాధితులకు సోమవారం ఆరున్నర టన్నుల కూరగాయలను లారీలో పంపి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు మాట్లాడుతూ విజయవాడ వరద బాధితులకు తమ వంతుగా కూరగాయలను ఉచితంగా అందించేందుకు వ్యాపారులు ముందుకు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో అదనపు సెక్రటరీలు రెహిమాన్, వెంకటేశ్, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, నాగేష్, శివన్న, సెక్యూరిటీ గార్డులు మద్దిలేటి, అన్నయ్య, కిరణ్ పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 9: విజయవాడలో సర్వం కోల్పోయిన వరద బాధితులకు సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో విరాళాలను సేకరించినట్లు రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఆవుల శేఖర్ తెలిపారు. సోమవారం నగరంలోని పలు ప్రాంతాలలో దుకాణాలకు తిరిగి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ వరద బాధితుల కోసం ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి విరాళాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, సి.మహేష్ పాల్గొన్నారు.

● సీఐటీయూ న్యూసిటీ కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు సహాయార్థం సి.క్యాంపు నుంచి నంద్యాల చెక్‌పోస్టు వరకు విరాళాలను సేకరించారు. జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, పీఎస్.రాధాక్రిష్ణ, సాయిబాబా పాల్గొన్నారు.

దళిత, గిరిజనులకు సంక్షేమ పథకాలు అందాలి


మాట్లాడుతున్న జానయ్య

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 9: రాష్ట్రంలోని దళిత, గిరిజనులకు నేరుగా సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వాలు కృషి చేయాలని జై భీమ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చిక్కం జానయ్య అన్నారు. సోమవారం నగరంలో పర్యటించిన అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో మాదిగ కులాలు అధిక సంఖ్యలో ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దళిత, గిరిజనులకు అందించే సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందకుండా నాయకులు, అధికారులు వివక్షచూపుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి సత్యన్న, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రశాంత్, ఉపాధ్యక్షుడు ఎర్రన్న, ప్రసాద్, కర్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో రేష్మాకు పతకం


రేష్మాను అభినందిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 8: గత నెల 31 నుంచి ఈనెల 4వ తేదీ వరకు నేపాల్‌లోని పోకోరలో ఎస్‌బీకేఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ 57 కేటగిరి పోటీల్లో కర్నూలు చెందిన రేష్మా పతకం సాధించారు. సోమవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ లోకేశ్, గోపి అభినందించి బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ మాట్లాడుతూ రేష్మా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించడం ఎంతో హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సుప్రియ, శ్యాం పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో అర్జీలు పరిష్కరించాలి

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 9: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ ఆదేశించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 18 అర్జీలు వచ్చాయి. ప్రజల నుంచి ఒక్కొక్క అర్జీ స్వీకరిస్తూ, వారి సమస్యను విన్న కమిషనర్ వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ డి.వేణుగోపాల్, ఆరోగ్య అధికారి కే.విశ్వేశ్వరరెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్‌కుమార్, మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఓ జునైద్ తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

కల్లూరు, సెప్టెంబరు 9: స్వచ్ఛ ఆంధ్రా క్లాప్ డ్రైవర్లకు 9 నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ నగర అధ్యక్షుడు అబ్దుల్‌దేశాయ్, ఓల్డ్‌సిటీ కమిటీ ఆధ్వర్యంలో గణేష్‌నగర్‌లోని మేయర్ బీవై. రామయ్య కార్యాలయం ముందు క్లాప్ డ్రైవర్లతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. గత 9 నెలలుగా జీతాలు లేక పస్తులుండాల్సి వస్తున్నదని, కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరారు. నగరంలోని 52 వార్డుల్లో చెత్తను తరలిస్తూ స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుతున్న క్లాప్ డ్రైవర్లు వేతనాలు లేకుండా ఎన్ని రోజులు ఎదురుచూడాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్రిమెంట్ ప్రకారం రూ.24 వేల జీతం అందించి ఈఎస్ఐ, పీఎఫ్, పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

గడియారం ఆసుపత్రిలో అవినీతిని అరికట్టాలి

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 9: పాతబస్తీలో ఉన్న గడియారం ఆసుపత్రిలో అవినీతిని అరికట్టాలని సీపీఎం పాతబస్తీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ పీవీ రామలింగేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ గడియారం ఆసుపత్రికి నగరంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ఎక్కువ మంది కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం వస్తారన్నారు. అయితే ఆసుపత్రిలో ఓ వైద్యుడు అవినీతికి పాల్పడుతూ ఆయన చెప్పిన ల్యాబ్‌కే వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని...ఇతర ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకుని వస్తే రిపోర్టులను చించివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జయమ్మ, అబ్దుల్ దేశాయ్, ఎన్ఎండీ షరీఫ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 9: నందవరం మండలం పూలచింత ఎంపీయూపీ పాఠశాలలో పనిచేస్తున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు పవన్ కుమార్‌ను సస్పెన్షన్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బీటీఏ అసోసియేషన్ నాయకులు పవన్ కుమార్‌పై ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రథమ చికిత్సపై అవగాహన

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 9: యువజన సర్వీసుల శాఖ-సెట్కూరు ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో ప్రథమ చికిత్సపై అవగాహన సదస్సు జరిగింది. కేవీఆర్ కళాశాలలో ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం సందర్భంగా ఎంప్లాయిమెంట్ అధికారి, సెట్కూరు సీఈవో దీప్తి మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు ప్రమాద స్థలంలో ఉన్నవారు వారికి తక్షణమే వైద్య సహాయం అందేటట్లు చర్యలు తీసుకోవడమే ప్రథమ చికిత్స అన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి భీమశంకర్ రెడడ్డి, బాబురావు, కళాశాల అధ్యాపకులు దేవికారాణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

కోడుమూరు(రూరల్), సెప్టెంబరు 9: కోడుమూరు సెబ్ పోలీసులు సోమవారం జరిపిన దాడుల్లో 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సెబ్ సీఐ రామాంజనేయులు మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని లక్ష్మీనగరంలో పెద్దరంగస్వామి అనే వ్యక్తి వద్ద నాటుసారాను స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

న్యాయవాదుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి

కర్నూలు(లీగల్), సెప్టెంబరు 9: రాష్ట్రంలో న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ సమావేశంలో చర్చించి అవసరమైన చట్టాలను రూపొందించాలని కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి రవికాంత్ ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ జార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదులకు ఇన్సూరెన్స్, పెన్షన్, స్టైఫండ్ ఇచ్చేలా ఇటీవలే ఒక చట్టాన్ని చేసిందని, మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని న్యాయవాదులకు కూడా ఇటువంటి చట్టాలను చేయాలని డిమాండ్ చేశారు.

● **న్యాయవాదుల సంక్షేమానికి చట్టాలు చేయాలి:** న్యాయవాదుల సంక్షేమానికి దేశంలోనే మొదటిసారిగా జార్ఖండ్ ప్రభుత్వం చట్టాలను చేసిందని, మన రాష్ట్రంలో కూడా న్యాయవాదులకు ఇన్సూరెన్స్, పెన్షన్, స్టైఫండ్‌లను ఇచ్చేందుకు వీలుగా చట్టాలు తీసుకురావాలని ఐఏఎల్ నాయకులు బీఎస్ రవికాంత్ ప్రసాద్, కే.రంగనాథ్, పి.దస్తగిరి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 9: ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో జరిగిన బీఎస్సీ నర్సింగ్ సప్లిమెంటరీ పరీక్షలో విద్యార్థులకు మాస్ కాపీయింగ్‌కు సహకరించిన సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ పి. రంజిత్‌బాషాకు విద్యార్థి సంఘాల నాయకులు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్ ఉదయ్ కుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, బీసీ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులు శేఖర్ మాట్లాడుతూ గత నెల 27వ తేదీ నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు బీఎస్సీ నర్సింగ్ సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలో మాస్ కాపీయింగ్ సహకరించినందుకు నర్సింగ్ కళాశాలల నుంచి సూపరింటెండెంట్, ట్యూటర్లుకు భారీ మొత్తంలో ముడుపులు అందాయని ఆరోపించారు.

నిరుపేద విద్యార్థినికి కలెక్టర్ చేయూత

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 9: నిరుపేద విద్యార్థిని డి.హాసిని ఐఐటీ పరీక్షలకు సిద్ధం అయ్యేందుకు కలెక్టర్ పి.రంజిత్ బాషా ల్యాప్‌ట్యాప్ అందజేశారు. కర్నూలు నగరం విఠల్‌నగర్‌లో నివాసముంటున్న హాసిని అనే విద్యార్థినికి తండ్రి లేరు. పేదరికంలో ఉన్న తల్లి శారదమ్మ కష్టపడి తన కూతురుకు సర్వేపల్లి రాధాకృష్ణ పాఠశాలలో చదివించింది. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలో హాసినికి 600 మార్కులకు గాను 530 మార్కులు సాధించింది. గాయత్రీ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం 470/437 మార్కులు సాధించింది. ఐఐటీ పరీక్షలకు సిద్ధమవుతున్న హాసిని పేదరికం కారణంతో ల్యాప్‌ట్యాప్ కొనలేకపోతున్న పరిస్థితిని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కలెక్టర్ వెంటనే స్పందించి కెనరా బ్యాంకు ద్వారా సీఎస్ఆర్ నిధులతో ల్యాప్‌టాప్‌ను మంజూరు చేయించి హాసినికి అందజేశారు.

14న ఏపీటీఎఫ్ జిల్లా విద్యా-వైజ్ఞానిక మహాసభలు

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 9: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఆవిర్భవించి 80 సంవత్సరాలు పూర్తియిన సందర్భంగా ఓక్ జూబ్లీ వేడుకలను, జిల్లా విద్య-వైజ్ఞానిక మహాసభలను ఈ నెల 14వ తేదీన రెండో శనివారం జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి. హృదయరాజు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.ఇస్మాయిల్, మరియానందం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు.

అక్రమ టైం స్కేల్ రద్దు చేయాలి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 9: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నాన్ టీచింగ్ ఉద్యోగులకు వర్తింప చేసిన అక్రమ టైం స్కేల్ రద్దు చేయాలని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిని చంద్రప్ప డిమాండ్ చేశారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీలో ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్‌ను ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేష్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెల్లించిన ఫీజులను యూనివర్సిటీ అధికారులు నాన్ టిచింగ్ ఉద్యోగులకు అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా జీతభత్యాలు చెల్లిస్తున్నారని వెంటనే నిలిపి వేయాలని కోరారు. టైం స్కేల్ ఉద్యోగులకు అక్రమంగా పదోన్నతులు కల్పించ డంతోపాటు ఏకంగా వారికి రెగ్యులర్ ఉద్యోగాలు చట్ట విరుద్ధంగా ఉందన్నారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉద్యోగం ప్రభుత్వ అనుమతి లేకుండా వారిని నియమించుకుంటున్నారని, యూనివర్సిటీ అధికారులు అత్యుత్సాహం చూపుతున్నారని మండి పడ్డారు. కార్యక్రమంలో అంబెడ్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మధు క్రిష్ణ, టీఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు'

సి.బెళగల్, సెప్టెంబరు 9: ప్రజలు, రైతుల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తహసీల్దార్ విజయశ్రీ వీఆర్వోలను హెచ్చరించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కర వేదిక కార్యక్రమానికి పది దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

'విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండాలి'


మాట్లాడుతున్న శిరిగిరెడ్డి జయారెడ్డి

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 9: విద్యార్థులు మానసికంగా దృడంగా ఉంటేనే పరీక్షల్లో, చదువులో విజయాన్ని సాధించగలుగుతారని సైకాలజిస్టు, హిప్నోథెరపిస్టు శిరిగిరెడ్డి జయారెడ్డి అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఎస్ ఏపీ క్యాంపులోని సీఆర్ఆర్ఎం మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మహత్యలు చేసుకునే వారి ప్రవర్తనను గుర్తించి తల్లిదండ్రులు వెంటనే వారిని మానసిక వైద్యనిపుణుల దగ్గరకు తీసుకుని రాగలిగితే.. వారికి హిప్నోథెరపి ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ప్రతినిధి రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల మానసిక స్థితిగతులను గమనిస్తూ ఉండాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ అధ్యక్షుడు పవన్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దారిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(రూరల్), సెప్టెంబరు 9: కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామంలో రైతులు పొలాలకు వెళ్లే ప్రధాన రహదారిని కబ్జా చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేవీ. నారాయణ, మండల కార్యదర్శి పీబీ ఉశేనయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం నాయకులు కబ్జాకు గురైన దారిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఆర్డీఎస్ కాలువ ద్వారా దాదాపు మూడువేల ఎకరాలకు నీళ్ల పారేవని అలాంటి కాలువను సైతం రియల్ ఎస్టేట్ వ్యాపారులు పూర్తిగా పూడ్చివేసి ఆక్రమించుకున్నారని ఆరోపించారు. రైతుల వారి పొలాలకు వెళ్లేందుకు కూడ దారిలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. వారివెంట పంచలింగాల మాజీ సర్పంచు వెంకటేశ్వర్లు, ఆదాము, ఉశేనయ్య, అబ్దుల్లా ఉన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళం

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 9: సీఎం సహాయ నిధికి ఆంధ్ర బ్యాంకు రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు విరాళం అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సీఎం సహాయ నిధికి విరాళంగా రూ.1,01,116 చెక్కును కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు ఆంధ్ర బ్యాం కు రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ప్రభాకర్, సెక్రటరీ కే.రాగవేంద్ర ప్రసాద్ అందజేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

కర్నూలు(రూరల్), సెప్టెంబరు 9: నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ కర్నూలు-2 డిపో మేనేజర్ సర్దార్ హుస్సేన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు డిపో పరి.ధిలో ఉన్న గ్రామాలకు సంబంధించిన బస్సు రవాణా సమస్యల పరిష్కారం కోసం మంగళవారం సాయంత్రం 4గంటల నుంచి 5 గంటల మధ్య ఎవరైన ఫోన్ చేసి సమస్యలు చెప్పవచ్చునన్నారు. ప్రయాణికుల సమస్యలపై ఇచ్చే సూచనలు పరిగణలోకి తీసుకొని ఆ మార్గంలో బస్సు రవాణా సౌకర్యంతోపాటు ఇతర సమస్యలను పరిష్కరిస్తామని డిపో మేనేజర్ వివరించారు. వివరాలకు 9959225794 సెల్ నెంబర్‌కు ఫోన్‌చేసి సమస్యలు చెప్పాలని ఆయన సూచించారు.

ఆర్‌యూలో అక్రమాలపై విచారణ చేయాలి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 9: రాయలసీమ యూనివర్సిటీలో అక్రమాలపై విచారణ చేయాలని భీమ్ ఆర్మీ రాష్ట్ర కన్వీనర్ ఎస్ విజయ భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం లోకాయుక్త కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. నింబంధనలకు విరుద్ధంగా నాన్‌టీచింగ్ ఉద్యోగులకు అక్రమంగా టైమ్ స్కేల్ ఇచ్చి హెచ్ఆర్ఏ ఐఆర్ వర్తింప చేస్తున్నారని ఆరోపించారు. లాస్ట్ గ్రేడ్ స్కేల్ ఉద్యోగులకు వర్తింప చేసే జీవో 194ను అడ్డుపెట్టుకుని అడ్డదారిలో అక్రమంగా ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికే కూడా టైమ్‌స్కేల్ వర్తింప చేసి అక్రమాలకు పాల్పడు తున్నారని ఫిర్యాదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, సెప్టెంబరు 9: విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉటుందని కర్నూలు డివిజన్ ఈఈ టి.శేషాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సంతోష్‌నగర్ సెక్షన్ సిరినోబుల్ 11 కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 12 వరకు కరెంట్ కోత ఉటుందన్నారు. వినాయక విగ్రహాల తరలింపులో ఇబ్బందులు తలెత్తకుండా కొత్తపోల్ ఏర్పాటు చేస్తున్నట్లు ఏడీఈ నాగప్రసాద్ తెలిపారు. అందులో భాగం గా స్టేట్ బ్యాంక్ ఆఫీసర్స్ కాలనీ, అమీన్‌హైదర్‌నగర్, సుంకేసులరోడ్, ధన లక్ష్మీనగర్, శ్రీనగర్‌కాలనీ, జనార్థన్ నగర్, వసంత రెసిడెన్సీ తుంగభద్ర కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

నిమజ్జన వైభవం

పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు పరిధిలోని గ్రామాల్లో సోమవారం వినాయక నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. యువకులు, మహిళలు విగ్రహాలను ఊరేగించారు. మూడు రోజులపాటు పూజలు నిర్వహించి, సమీపంలోని చెరువులు, కాలువల్లోని నీటిలోకి వదిలారు.


ఎమ్మిగనూరు పట్టణం ముగతిపేటలో యువత కోలాహలం


ఆలూరు: పూజలు చేస్తున్న యువకులు


ఆలూరు: చిప్పగిరి మండలం దౌల్తాపురం గ్రామంలో..


ఆదోని రూరల్: గ్రామాల్లో సందడి


మంత్రాలయం మండలంలో కోలాటం


ఎమ్మిగనూరులో నిమజ్జనం


తుగ్గలి మండలంలో..


కౌతాళం మండలంలో..


మద్దికెరలో..


గోనెగండ్లలో నిమజ్జనం ఊరేగింపు


నందవరంలో నిమజ్జనానికి తరలి వెళ్తున్న వినాయకుడు


హొళగుందలో నిమజ్జనానికి తరలి వెళ్తున్న వినాయకుడు

స్కూల్ గేమ్స్ సెలక్షన్స్

హొళగుంద, సెప్టెంబరు 9: మండలంలోని ఇంగళదాహల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 12, 13వ తేదీల్లో సెలక్షన్స్‌ను నిర్వహిస్తున్నట్లు కో-ఆర్డినేటర్ రామదాసు, హెచ్ఎమ్ జనార్దనయ్య సోమవారం తెలిపారు. 14 సంవత్సరాల్లోపు బాల బాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ అట్లాటిక్స్, చెస్, యోగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

వర్గీకరణ వ్యతిరేకంగా రేపు ఢిల్లీలో నిరసన

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 9: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 11న డిల్లీలో భారీ నిరసన సభ ఉంటుందని మాల మహానాడు జేఏసీ నాయకులు బసాపురం ఎల్లప్ప అన్నారు. సోమవారం మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును పునః పరిశీలించాలని కోరారు. యాదవ్, చంద్రశేఖర్ ఆజాద్ కార్యక్రమానికి హాజరువుతున్నారన్నారు. నరసన్న, నీలకంఠప్ప పాల్గొన్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి


తుంబలబీడులో పత్తి కాయను చూపుతున్న నాయకులు

ఆలూరు రూరల్, సెప్టెంబరు 9: భారీ వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని జాతీయ విపత్తుగా ప్రకటించాలని అఖల భారత రైతు సంఘం జిల్లా నాయకుడు బోయ మునిస్వామి డిమాండ్ చేశారు. సోమవారం తుంబలబీడు గ్రామంలో పంటలను పరిశీలించారు. వ్యవసాయ అధికారులు పరిశీలించి నివేదిక ఇవ్వాలని కోరారు. పత్తి పంటకు ఎకరాకు రూ.40 వేలు ఇవ్వాలన్నారు. నాగరాజు, రంగన్న, ఉచ్చప్ప, వీరాంజినేయులు పాల్గొన్నారు.

రైతు కోసమే పొలం పిలుస్తోంది: ఎమ్మెల్యే


పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, సెప్టెంబరు 9: రైతుప్రయోజనాల కోసమే ప్రభుత్వం పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిందని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. సోమవారం పొలంపిలుస్తుంది పోస్టర్లను విడుదల చేశారు. ఈనెల 24నుంచి ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయాధికారులు గ్రామాల్లో పాల్గొంటారని అన్నారు. ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్, పత్తికొండ, వెల్దుర్తి ఏవోలు వెంకటరాముడు, అక్బర్‌బాషా, హార్టికల్చర్ అధికారి దస్తగిరి ఇతర సిబ్బంది ఉన్నారు.

గర్భిణులకు అన్నదానం


గర్భిణులకు వడ్డిస్తున్న డీఎస్పీ వెంకట్రామయ్య, సీఐలు

పత్తికొండ, సెప్టెంబరు 9: ప్రభుత్వాసుపత్రిలో ప్రతి నెలా 9న స్కానింగ్ నిర్వహిస్తారు. వీరికి ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్నారు. గర్భిణులు, బంధువులు కలిపి దాదాపు 400 మందికి భోజనం అందిస్తున్నారు. సోమవారం డీఎస్పీ వెంకట్రామయ్య, సీఐలు జయన్న, పులిశేఖర్ పాల్గొని అన్నాన్ని వడ్డించారు. వైద్యాకారి కల్పన, టీడీపీ నాయకులు లోకనాథ్, వెంకటపతి, తిప్పన్న, బీజేపీ నాయకులు రామ్మోహన్ ఉన్నారు.

సీజినల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 9: సీజినల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ సలహాదారాలు నాగరత్నమ్మ, సర్పంచ్ కొమ్ము దీపిక, ఈవో నరసింహులు పేర్కొన్నారు. సోమవారం పంచాయతీలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. పందులను పట్టణానికి దూరంగా ఉంచాలని, యజమానులకు సూచించారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి పాత ఊరువాకిలి వరకు డ్రైనేజీలపై నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాలని సభ్యుడు లింగన్న కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను మారుస్తాం

మద్దికెర, సెప్టెంబరు 9: బస్టాండు వద్దగల ట్రాన్స్‌ఫార్మర్‌ను మారుస్తామని విద్యుత్ ఏఈ మహమ్మద్ రఫీ, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ అన్నారు. సోమవారం వారు ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తులో ఉండేలా ఏర్పాటు చేస్తామని, చుట్టూ కంచె వేస్తామని తెలిపారు. జడ్పీటీసీ డి. మురళిధర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మల్లికార్జున యాదవ్, సలహాదారులు అంజనేయులు, టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణ, గడ్డం రామాంజులు, సిబ్బంది రామచంద్ర, శేషసేన రావు తదితరులు ఉన్నారు.

విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటం

దేవనకొండ, సెప్టెంబరు 9: ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహిస్తామని ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శరత్‌కుమార్ అన్నారు. సోమవారం జూనియర్ కళాశాలలో ఎఐఎస్ఎఫ్ సభ్యత్వనమోదు నిర్వహించారు. పేదలకు విద్య అందని ద్రాక్షగా మారిందని, నూతన విద్యా విధానం పేరుతో కాషాయీకరణ చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని అన్నారు. మండల అధ్యక్ష ,కార్యదర్శులు మధు, భాస్కర్, ఉమేష్, సురేంద్ర, రవి ఉన్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలి

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 9: పట్టణంలో అరుంజ్యోతి నగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మహిళలకు మరుగుదొడ్లు నిర్మించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు హెబ్బటం రాజు కోరారు. సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథికి వినతి పత్రం అందజేశారు. మరుగుదొడ్లు లేక మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎస్సీఎస్టీ సబ్ ప్లాన్ నిధులతో పనులు చేయాలని కోరారు. కాలనీవాసులు వెంకటేష్, ఈరన్న, అంజని, లక్ష్మణ, రామాంజి, అశోక్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

ఆలూరు రూరల్, సెప్టెంబరు 9: గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలని అరికేర సర్పంచి కుప్పగల్లు నాగరాజు అన్నారు. సోమవారం గ్రామంలో తాగునీటి పైపులైను, డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. పంచాయతీల అభివృద్ధిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. ఇంటింటికీ తాగునీరు అందిస్తామన్నారు. కార్యదర్శి ఉసేని, ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పూలచింత ఉపాధ్యాయుడి సస్పెండ్

నందవరం, సెప్టెంబరు 9: మండలంలోని పూలచింత ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయుడిని డీఈవో శామ్యూల్ సస్పెండ్ చేసినట్లు ఎంఈవో రామాంజినేయులు సోమవారం తెలిపారు. విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తించారని, కులం పేరుతో దూషించారని, భోజనం సక్రమంగా ఇవ్వలేని ఫిర్యాదులు వెళ్లాయని అన్నారు.

సమస్యలను వేగంగా పరిష్కరించండి

- ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్
- ప్రజల నుంచి అర్జీల స్వీకరణ


అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే

ఆదోని, సెప్టెంబరు 9: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను వేగంగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్యే పార్థసారథితో కలిసి అర్జీలను స్వీకరించారు.

మండలాల నుంచి వచ్చిన సమస్యలు కొన్ని

ఆదోని మండలం పెద్దరిహరివాణం గ్రామానికి చెందిన హనుమంతు పొలం సర్వే నెంబర్ 85 ఏలో 1.37 ఎకరాలు, 9ఏలో ఎకరాలు ఉండగా ఆన్‌లైన్‌లో నమోదు చేయా లని కోరాడు. అదే గ్రామానికి చెందిన దేవమ్మ తన భర్త పేరుపై ఉన్న పొలాన్ని తన పేరుపై మార్చి పట్టాదార్ పాస్‌పుస్తకం ఇవ్వాలని అర్జీ ఇచ్చింది.

ఆదోని మండలం కల్లుబావికి చెందిన మల్లయ్యకు సర్వే నెం.200లో 0.77 సెంట్ల భూమి ఉండగా వారస త్వంగా రావలసిన 0.20 సెంట్లను ఆన్‌లైన్ చేయాలని అర్జీ ఇచ్చాడు. ఏవో వసుంధర్, సర్వేయర్ వేణు సూర్య శ్రీనివాస రాజు, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, డీఎల్పీవో నూర్జహాన్, డీఎల్‌డీవో నాగేశ్వరరావు, హౌసింగ్ డీఈ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కృష్ణారెడ్డి, ఆర్టీసీ డీఎం మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

వసతి గృహం తనిఖీ


విద్యార్థినులతో మాట్లాడుతున్న అధికారి శ్రీనివాసులు

వెల్దుర్తి, సెప్టెంబరు 9: పట్టణంలోని బాలికల (వెనుకబడిన తరగతులు) వసతి గృహాన్ని కర్నూలు రూరల్ అసిస్టెంట్ బి.సి. వెల్ఫేర్ అధికారి శ్రీనివాసులు సోమవారం తనిఖీ చేశారు. హాస్టల్‌లో అందుతున్న సౌకర్యాలపై విద్యార్థినులను అడి గి తెలుసుకున్నారు. గత సంవత్సరం పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినందుకు వార్డెన్ శైలజను ఆయన అభినందించారు.

క్షయ రోగులకు ఉచిత మందులు

ఆదోని టౌన్, సెప్టెంబరు 9: క్షయ రోగులకు ఉచిత మందులు, రూ.500 ప్రభుత్వం ఇస్తుందని వైద్యాధికారులు తెలిపారు. పట్టణంలోని అరుణ్ జ్యోతి నగర్, షరాఫ్ బజార్ ప్రాంతాలకు చెందిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో సోమవారం మెడికల్ ఆఫీసర్ డా. శేకున్ భాను ఆధ్వర్యంలో ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్షయ వ్యాధి లక్షణాలు, వ్యక్తిగత శుభ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యులు గాయత్రీ, అనిల్ సాగర్, వినోద్ కుమార్ అవగాహన కల్పించారు.

వ్యాధి సోకిన వారికి ఉచిత పరీక్షలతో పాటు మందులను అందిందిస్తామని అన్నారు. రూ. 500 ప్రకారం ఆరు నెలల పాటు ఇంటి ఖర్చుల కోసం ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌యస్ బాబురాజు, మనోరంజని దేవి, జ్ఞానేశ్వరి దేవి, మేరీ, లలితమ్మ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

దేవనకొండ, సెప్టెంబరు 9: మండలంలో వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా నాయకులు వీరశేఖర్, ఆశోక్ ,యూసుప్ బాషా డిమాండ్ చేశారు. పత్తి కాయలు రాలిపోయాయని, నల్లమచ్చలు రావడంతో దిగుబడి రావడం కష్టమన్నారు. టమోట, మిరప రైతులు కూడా నష్టపోయారని ఆదుకోవాలని కోరారు.

పంట నమోదు పూర్తికి చర్యలు

మద్దికెర, సెప్టెంబరు 9: ఖరీఫ్ సీజన్‌కు పంటనమోదును ఈ నెల 15వ తేదీ లోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏవో రవి అన్నారు. సోమవారం పంటలను పరిశీలించారు. ప్రభుత్వ పథకాలు, బీమా పరిహారానికి ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవడడం ఎంతో అవసరమన్నారు. మండలంలో ఇప్పటి వరకు 96 శాతం పూర్తిచేశామని, వంద శాతం పూర్తి చేస్తామని, ఇందుకు రైతులు సహకరించాలని ఏవో కోరారు.

టెర్రరిస్టుల్లా వైసీపీ పాలన


మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు వీరభద్ర గౌడ్

ఆలూరు, సెప్టెంబరు 9: ఐదేళ్ల వైసీపీ పాలన టెర్రరిస్ట్ పాలనను తలపించిందని టీడీపీ నాయకుడు వీరభద్ర గౌడ్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో విలేఖర్ల సమావేశం నిర్వహించారు. పార్టీ అధినేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా దేశం మొత్తం రోడ్కెక్కి జనం ఆందోళనలు చేశారన్నారు. 70 దేశాల్లో కూడా నిరసనలు తెలిపారని అన్నారు. కూటమి ప్రభుత్వంతో రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందన్నారు.. వరదల్లో స్వయంగా సీఎం చంద్రబాబు సహాయక చర్యలు చేపట్టడం అభినందనీయమని అన్నారు.

వరద బాధితులకు 1,500 కిట్లు

ఆలూరు టీడీపీ అధ్వర్యంలో వరద బాధితులకు 1,500 కిట్లు అందజేస్తున్నట్లు వీరభద్ర గౌడ్ తెలిపారు. గిరి మల్లేష్ గౌడ్, కన్వీనర్ అశోక్ యాదవ్, కామినెహాల్ రమేష్, రాము యాదవ్, బీజేపీ నాయకులు బసవరాజు పాల్గొన్నారు. అతాగే హాలహర్వి మండలం కామినేహాల్ రమేష్ రూ.80వేలు అందజేశారు. ఆలూరు మండలం అంగస్కల్ గ్రామ టీడీపీ నాయకుడు హనుమంతు రెడ్డి రూ.38వేలు విరాళం అందజేశారు.

తుగ్గలి: వరద బాధితులకు మాజీ ఉప మండలాధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, మాజీ సర్పంచులు వెంకటస్వామి, ఫక్కీరప్ప, ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి విరాళాలను ఎమ్మెల్యేకు అందజేశారు.

మద్దికెర: ఎమ్మెల్యే శ్యాంబాబుకు మాజీ జడ్పీటీసీ పి.పురుషోత్తంచౌదరి, రత్నకుమారి దంపతులు రూ.1.20లక్షలు, పెరవలి కార్యకర్తలు రూ.1.50లక్షలను(అందజేశారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి రామాంజులు, అంజనేయ, తెలుగు యుత ఉపాధ్యక్షుడు మూలింటి రాముా యాదవ్, మెడికల్ రాము, నరసింహులు, ప్రభాకర్ ఉన్నారు.

చిన్నారి విరాళం

ఆదోని టౌన్: కిడ్డీస్ రూట్స్ పాఠశాల రెండో తరగతి విద్యార్థి యాగ్నిక్ పాకెట్ మనీ రూ.2,080 అందజేసారు. డైరెక్టర్లు కేశవ్ నారాయణరెడ్డి, నారపురెడ్డి అభినందించారు.

పత్తికొండ టౌన్: వరద బాధితులను ఆదుకుందామని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పిలుపు నిచ్చారు. సోమవారం కార్యాలయంలో టైలర్స్ అసోసియేషన్, ప్రభాస్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో దుస్తులు, బియ్యం, నిత్యావసరాలను అందజేశారు. కార్యదర్శులు రాజాసాహేబ్, రామాంజనేయులు, ప్రజా సంఘాల నాయకులు కారన్న, తిమ్మయ్య, రంగన్న, ఈరన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన మట్టి మిద్దె

వెల్దుర్తి, సెప్టెంబరు 9: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో అల్లుగుండు గ్రామంలో హనీఫ్‌కు చెందిన మట్టి మిద్దె కూలింది. టీవీ, ఫ్రిడ్జ్, సామాగ్రి ధ్వంసమయ్యా యని రూ.1లక్ష ఆస్తినష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. కాగా మిద్దె కూలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవటంతో ప్రాణాపాయం తప్పింది.

నిమజ్జనంలో స్వల్ప ఘర్షణ

పత్తికొండ, సెప్టెంబరు 9: పట్టణంలో సోమవారం వినాయక నిమజ్జనంలో యువకుల నడుమ స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. ఊరివాకిలివద్ద ఏర్పాటుచేసిన బుల్స్ అండ్ ఈగల్స్ పాతపెట్రోల్‌బంక్‌వద్ద ఏర్పాటుచేసిన ఇడియట్స్ విగ్రహాల ఊరేగింపు అంబేడ్కర్ సర్కిల్‌వద్ద ఎదురుపడ్డాయి. ఈక్రమంలో ఇరుమండపాల యువకుల నడుమ వివాదం చోటుచేసుకోవడంతో ఒకరిపై ఒకరు రాళ్లురువ్వున్నారు. విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అర్బన్ సీఐ జయన్న ఇరువర్గాలను అక్కడినుండి పంపించివేయడంతో గొడవసద్దుమణిగింది. సీఐని వివరణకోరగా సర్దిచెప్పి పంపివేశామన్నారు.

ఆటో డ్రైవర్ మృతి

వెల్దుర్తి, సెప్టెంబరు 9: పట్టణంలో స్థానిక 12వ వార్డు రాణితోటకు చెందిన ఆటో డ్రైవర్ శివరామిరెడ్డి (42) గుండెపోటుతో సోమవారం మృతిచెందాడు. వివరాల మేరకు.. బాత్‌రూమ్‌లో కిందపడ్డాడు. హుటాహుటిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య హరిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏఐటీయూసీ నాయకులు నివాళి అర్పించారు.

పొలంలో నీరు.. రైతు కన్నీరు

- రూ.లక్షల్లో పంట నష్టం, ప్రభుత్వం ఆదుకోవాలని వినతి


ఆదోని మండలం ధనాపురం గ్రామంలో నీట మునిగిన పత్తి

ఆదోని, సెప్టెంబరు 9: మండలంలోని ఆదోనితో పాటు ధనాపురం, నాగనాతనహల్లి, సాదాపురం, దిబ్బనకల్లు, నారాయణపురం, చాగి, కల్లుబావి, పర్వతాపురం గ్రామాల్లో వందిలాది ఎకరాల్లో పత్తి, కంది పంటలు దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు. పత్తికి ఎకరాకు రూ.30వేలు, మిరప రూ.1.5లక్షలు పెట్టుబడి పెట్టామని ఇలా నీట మునిగితే ఏమి కావాలని రైతులు లబోదిబోమంటున్నారు.

పట్టించుకోని వ్యవసాయ అధికారులు

భారీ వర్షాలతో తాము నష్టపోతే వ్యవసాధికారులు కన్నెత్తి చూడటం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.